## రచనలకు ఆహ్వానం

చలం ఫౌండేషన్ ప్రతి మూడు నెలలకొకసారి తీసుకువస్తున్న **'చలనం-3'** బులెటిన్‌కు చలం సాహిత్యం మీద, చలం భావాలమీద వ్యాసాలుగానీ, కవితలుగానీ ఆహ్వానిస్తున్నాం.

రచనలు పంపవలసిన చిరునామా:

**చినుకు ప్రచురణలు,** దత్తాస్ నయాబజార్, రాజ్ యువరాజ్ థియేటర్స్ ఎదురుగా, గాంధీనగర్, విజయవాడ - 520 003.

## వివరణ

'చినుకు' ప్రత్యేక సంచికలో భమిడిపాటి జగన్నాథరావు గారి కథలపై కీ.శే. వాసుదేవరావుగారు చనిపోవడానికి ముందు రాసిన ఆఖరి వ్యాసం.

'భమిడిపాటి జగన్నాథరావు కథలు' వేదగిరి కమ్యూనికేషన్స్ తరఫున వేదగిరి రాంబాబుగారు ప్రచురించారు. సాంకేతిక కారణాలవల్ల శ్రీహర్ష ప్రచురణలు అని అచ్చయ్యింది.

# ఓటమి ముందు

## మాధవీ సనారా

పుస్తకం ముందు కూర్చుంటానా
బందురోజు ఆందోళనకారులొచ్చి
షట్టర్లను దింపించి
షాపుల్ని బలవంతంగా మూయించినట్లు
నిద్రగాళ్లొచ్చి
బలవంతంగా రెప్పల మీద బైఠాయిస్తారు.
ఒక్కోసారి ప్రతిఘటిస్తుంటాను
అయినప్పటికీ
వాళ్ల నిర్బంధానికి గురై
పుస్తక పఠన పదవీ విరమణ చేస్తుంటాను
ఒక్కోసారి
నాదృఢ దీక్షా సంకల్పబలం ముందు
వాళ్ళే తోక ముడుస్తుంటారు
అయినా ఒక్కో సమయంలో
ఓటమి ముందు చతికిలపడుతుంటాను
జయాపజయాలు
ఎవరికైనా అనివార్యమే కదా!

# గర్భిణి

## గుండాన జోగారావు

ఆకాశమంతా నల్లగా నిశ్శబ్దంగా ఊపిరి బిగపట్టినట్టు ఉంది.

అప్పుడే తాజాగా ఎన్‌కౌంటర్ జరిగిన కల్లోలిత స్తబ్దత.

ఆంధ్రా ఒరిస్సా బోర్డర్లో కొండకోనేరు గుండెల నిండుగా ఇనుప బూట్ల చప్పుళ్ళు. అణువణువూ తనిఖీ చేస్తూ... తలెత్తే వారిని తలదించుకునేలా ప్రశ్నిస్తూ..... నిలబడి చోద్యం చూస్తున్న వారిని నిలదీస్తూ....

విజయనగరం- రాయగడ రైల్వే సెక్షన్లో ఆంధ్రా ఒరిస్సా బోర్డర్ ఏరియాలో మానేరు రైల్వే స్టేషనుకు దగ్గర్లో ఉన్న ఊరు.... చుట్టూ కొండల మధ్య ఉందేమో .... ఊరు కొండకూనేరు.

ఆ రోజు సాయం సంధ్యలో చీకటి పడుతుండగా గబగబా నడుచుకుంటూ వెళ్ళి పోతోంది చుక్కమ్మ. నిండు గర్భిణి అని కూడా ఆలోచించ కుండా త్వరిత గతిన అడుగులేసుకుంటూ సాగిపోతోంది.

'కౌన్ హైరే.... షామ్ హోగయా... కహా జారహేహో' చుక్కమ్మని ఆపి అడిగాడు అడవి ప్రాంతంలో గస్తీ తిరుగుతోన్న కమెండో .

చేతులెత్తి నమస్కరించింది చుక్కమ్మ.

మసక చీకట్లో ఆమె ఉబ్బిన కడుపు చూసి ' క్యాహైరే ఇదర్' అని అడిగాడు కాస్తా వ్యంగ్యంగా.

'నెలలు నిండినాయి బాబూ' జవాబిచ్చింది చుక్కమ్మ.

అర్థం కానట్టు నటిస్తూ 'ఉరావ్' అని హూంకరించాడు.

ఆమె చీర ఎత్తుతోంది..... కాళ్ళపై నుండి తొడవరకూ ఎత్తింది.....

'క్యారే రాజేష్.... క్యాకర్ రహేహో' అంటూ అక్కడికి వచ్చాడు ఒక తెలుగు తెలిసిన కమెండో ... తెలుగు కమెండో.

'అంధ కార్ వే అకేలే... జంగిల్‌మే.... ఏసాలీ ... పూచ్.... కహాసే ఆ రహీహై'

'ఎక్కడ్నుంచి వస్తున్నావ్ ?' అడిగాడు తెలుగు కమెండో.

'జిమిడిపేట అడవుల్నుండి కట్టెలు తెచ్చి తీసుకెళ్ళి పార్వతీపురంలో అమ్ముకుంటాం బాబయా... ఆ సొమ్ముతో నే కుటుంబం నాలుగు మెతుకులు కతికేది' జవాబిచ్చింది చుక్కమ్మ.

'మరింత వేళవరకూ ఏం చేస్తున్నావ్?'

'రైల్లో పార్వతీపురం వెళ్తుంటే కట్టెలమూటకి యాభై ఇవ్వాల్సిందే అని ఆపేసాడు టీసీ బాబు.... బతిమాలి వేడుకుని ముప్పయితో తెగ్గొట్టుకుని పార్వతీపురం వెళ్ళి సరుకు అమ్మి తిరిగొచ్చే సరికి ఈ ఏళయిందిబాబు... పైగా నెలలు .... నడవలేక పోతున్నా' అంది ఆయాసంగా చుక్కమ్మ.

'ఛోడ్ దేరే రాజేష్.. పేటీహై'

ఇక్కడి వాతావరణం బాగాలేదు... అన్నలతో నిత్యం కాల్పులు జరుగుతున్నాయి.... తొందరగా వెళ్లిపో..... ఇల్లెక్కడ'

'అడవిలో మరో మైలు దాటితే చిన్న పాక బాబూ... నేనూ నా జబ్బుపడిన మగడితో నలుగురం'

'సరే.... లగెత్తు' ఆదేశించాడు తెలుగు కమెండో.

చుక్కమ్మ ఒకసారి నమస్కరించి వడివడిగా అడుగులేసుకుంటూ అడవిలో ముందుకు సాగిపోయింది. డొంకలూ కంపలూ దాటుకుంటూ ఓ మైలు దూరం పోయిన తర్వాత చటుక్కున ఓ చిన్నపాకలోకి దూరింది. దూరి భళ్లున ప్రసవించింది.... అరడజను శక్తివంతమైన బాంబుల్ని .....నాలుగు చిన్న పిస్టల్ని... ఒక ప్రణాళికా పత్రాన్ని!

చుక్కమ్మ, ఎలియాస్ తార, ఎలియాస్ అరుణక్క!!